నేడు ఉచిత వైద్య శిబిరం

మణికొండ: అలకాపూర్‌ టౌన్‌షిప్‌ రోడ్డు నెంబర్‌ 13 వద్ద ఆదివారం ధన్వి మల్టిస్పెషాలిటీ క్లినిక్స్‌, రిథమ్‌ స్పెషాలిటీ క్లినిక్స్‌ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ధన్వి మల్టీ స్పెషాలిటీ క్లినిక్స్‌ ఎండీ డాక్టర్‌ కె. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రముఖ ఆస్పత్రులలో పనిచేసే డాక్టర్లు ఈ శిబిరంలో పాల్గొని అన్ని రకాల రోగాలకు పరీక్షలు నిర్వహించి మందులు, సలహాలను అందిస్తారన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. మున్సిపాలిటీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా మహేశ్‌కుమార్‌గౌడ్‌ పుట్టినరోజు



పండ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌

రాజేంద్రనగర్‌: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్‌ డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌ రెడ్డి ఆధ్వర్యంలో బుద్వేల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే కేక్‌ కట్‌ చేశారు. పార్టీ నాయకులు కోరని బాల్‌రాజ్‌, రగడంపల్లి శ్రవణ్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అక్రమ నల్లాలపై విజిలెన్స్‌ ఫోకస్‌

శంషాబాద్‌: శంషాబాద్‌ మున్సిపాలిటీ పరిధిలో శనివారం హైదరాబాద్‌ మెట్రో వాటర్‌ బోర్డు విజిలెన్స్‌ అధికారులు తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్‌ సీఐ సురేష్‌ ఆధ్వర్యంలోని బృందం ఆదర్శనగర్‌, మధురానగర్‌, వెళంకనీ కాలనలో ఇంటింటి తనిఖీలు నిర్వహించారు. ఇందులో ఓ నల్లా కనెక్షన్‌ గుర్తించిన అధికారులు దానికి పంచాయతీ కాలం నాటి అనుమతి ఉన్నట్లు చూపించడంతో దానిని ధ్రువీకరించేందుకు పరిశీలిస్తున్నారు. అక్రమ నల్లాలుంటే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు హెచ్చరించారు.

శారదాధామం ఏవోగా కెప్టెన్‌ వెంకటరంగారావు



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని శ్రీ శారదా ధామం ప్రాంగణంలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం శ్రీ శారదా ధామం అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌ (పాలనాధికారి)గా కెప్టెన్‌ రంగారావు నియమితులయ్యారు. ఆర్మీలో ఆర్మీ ఎడ్యుకేషన్‌ కోర్‌లో 28 సంవత్సరాలపాటు ఆయన సేవలు అందించారు. కెప్టెన్‌ కె.వెంకట రంగారావును అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌గా నియమించినట్లు విద్యారణ్య ఆవాస విద్యాలయం శారదాధామం కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్‌, ఆవాస విద్యాలయం అధ్యక్షుడు గోకరి అర్జున్‌గౌడ్‌ తెలిపారు.

లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

శంషాబాద్‌ రూరల్‌: లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి(45) మృతి చెందాడు. మండలంలోని పాల్మాకుల వద్ద శనివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... బెంగళూరు జాతీయ రహదారిపై పాల్మాకుల గ్రామ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు పక్కన ఉండగా.. షాద్‌నగర్‌ వైపు నుంచి శంషాబాద్‌ వెళ్తున్న లారీ అతన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సరఫరాను మెరుగుపరచాలి

గోల్కొండ: కార్వాన్‌లో తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని కార్వాన్‌ గుడ్‌ గవర్నెన్స్‌ ఫోరం నాయకులు జలమండలి మేనేజింగ్‌ డైరెక్టర్‌ అశోక్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఫోరం నాయకులు శనివారం జలమండలి మేనేజింగ్‌ డైరెక్టర్‌ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. పలు ప్రాంతాల్లో నీరు లో ప్రెజర్‌లో వస్తుందని మరికొన్ని ప్రదేశాల్లో పట్టుమని పది నిమిషాలు సైతం నల్లాలో నీరు రావడం లేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. జలమండలి ఉన్నతాధికారులు కార్వాన్‌లో పర్యటించి తాగునీటిపై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫోరం నాయకులు జొన్నకుంటి మధుసుధన్‌, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్‌, ఎస్‌.శ్రీనివాస్‌ తదితరులున్నారు.

నల్లాలకు మోటార్లపై నజర్‌!

- దాడులు నిర్వహిస్తున్న అధికారులు
- అధికారుల రాకతో మోటార్ల తొలగింపు
- నీటిని వృథా చేసినా జరిమానా: జీఎం సాయిలక్ష్మి



స్వాధీనం చేసుకున్న మోటార్‌తో అధికారులు

రాజేంద్రనగర్‌: మంచినీటి కుళాయిలకు మోటార్లు బిగించి నీటిని తోడేసుకుంటున్న వారిపై జలమండలి అధికారులు ఫైర్‌ అవుతున్నారు. అక్రమార్కులపై కేసులు నమోదు చేయడంతో పాటు మోటార్లను స్వాధీనం చేసుకొని జరిమానా విధిస్తున్నారు. మంచినీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేస్తున్నా లోప్రెషర్‌తో పాటు నీరు సరిగా రావడం లేదనే ఫిర్యాదులు అధికం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో నల్లాలకు మోటార్లు బిగించిన వారిపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. నల్లాలకు నీటిని వదిలే సమయంలో అధికారుల బృందం ఇంటింటికీ తిరుగుతూ మోటార్లు బిగించిన వారిని గుర్తిస్తున్నారు. నాలుగు రోజుల్లో 10 కేసులను నమోదు చేశారు. శనివారం ఉప్పర్‌పల్లిలో జలమండలి మేనేజర్‌ శ్రావ్య రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. మోటార్లు బిగించిన వారిని గుర్తిస్తూ వారి మోటార్లను స్వాధీనం చేసుకున్నారు.

పలు ప్రాంతాల్లో మోటార్ల తొలగింపు...

న్యూ ఫ్రెండ్స్‌ కాలనీ ఫేజ్‌-1లో శనివారం మంచి నీటి సరఫరాను ప్రారంభించిన సమయంలో జలమండలి మేనేజర్‌ శ్రావ్య రెడ్డి, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ జావీద్‌, లైన్‌ ఇన్‌స్పెక్టర్‌ మహేశ్‌ సింగ్‌తో పాటు ఇతర సిబ్బంది కాలనీలోకి తనిఖీల కోసం వచ్చారు. కాలనీలో ఓ ఇంటిలో నల్లాకు బిగించిన మోటార్‌ను స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల ఇళ్లల్లోని వారు హుటాహుటినా తమ మోటార్లను తొలగించారు. మోటార్లను బిగించడం ద్వారా నల్లాలో నీటి సరఫరా లో ప్రెషర్‌తో వస్తూ ఇతరులకు ఇబ్బందులు తలెత్తుతాయంటూ కాలనీవాసులకు అధికారులు అవగాహన కల్పించారు. మోటార్లు బిగించవద్దని ప్రతి ఇంటికీ సరిపడేలా నీటిని అందిస్తున్నామని వెల్లడించారు.

- నీరు సరఫరా అయ్యే సమయంలో ప్రతి బస్తీ, గల్లీల్లో మంచినీరు ఏరులై పారుతోంది. నీటిని పట్టుకున్న అనంతరం కొందరు తమ వాహనాలను, ఇళ్లను శుభ్రం చేసేందుకు నీటిని వినియోగిస్తున్నారు. అలాగే వాహనాలను సైతం శుభ్రం చేస్తున్నారు. ఇలా నీటిని వృథా చేసే వారికి రూ. 1000 ప్రకారం జరిమానా విధిస్తామని రాజేంద్రనగర్‌ సర్కిల్‌ జలమండలి జీఎం సాయిలక్ష్మి హెచ్చరించారు.
- రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలోని అత్తాపూర్‌, రాజేంద్రనగర్‌, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్‌ డివిజన్ల పరిధిలో మొత్తం 45 వేల నివాసాలకు నల్లా కనెక్షన్లు ఉన్నాయి. రోజు విడిచి రోజు మంచినీటిని సరఫరా చేస్తున్నారు.
- గృహ అవసరాల కనెక్షన్లతో పాటు కమర్షియల్‌ కనెక్షన్లు సైతం ఉన్నాయి. ఈ కనెక్షన్లకు విడిగా నీటి సరఫరాను చేస్తున్నారు. బల్క్‌ కనెక్షన్లు ఉన్నా.. అపార్ట్‌మెంట్లు, విల్లాలకు అదనంగా నీటిని సరఫరా చేస్తున్నారు.

వృథాచేస్తే జరిమానా తథ్యం

కుళాయిలకు మోటార్లు బిగించి నీటిని తోడుతున్న వారిని ఎప్పటికప్పుడు గుర్తించి మోటార్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు జరిమానా విధిస్తున్నట్లు రాజేంద్రనగర్‌ సర్కిల్‌ జలమండలి జీఎం సాయిలక్ష్మి తెలిపారు. నీటిని రోడ్లపై వృథాగా వదిలేసే వారిని సైతం గుర్తించి ఫైన్‌ వేస్తున్నామన్నారు. తాగేందుకు, ఆహార పదార్థాల తయారీకి మాత్రమే మంచినీటిని వాడాలన్నారు. ఇతర అవసరాలకు మంచినీటిని ఉపయోగించవద్దని కోరారు.

పేదలకు ఉచిత వైద్య సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాజేంద్రనగర్‌: పేద ప్రజలకు రాఫా ప్రకృతి వైద్య యోగా ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ అన్నారు. శనివారం రాజేంద్రనగర్‌ డివిజన్‌ పరిధి బుద్వేల్‌లోని రాఫా ప్రకృతి వైద్యం అండ్‌ యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా మెడికల్‌ క్యాంపుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మానవ సేవే మాధవ సేవ అనే లక్ష్యంతో పేదలకు ఉచిత సేవలు అందించే ఉద్దేశంతో ఇలాంటి క్యాంపులు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేడికోవర్‌ ఆస్పత్రి, అమీర్‌పేట్‌ విజయ డయాగ్నోస్టిక్‌ సెంటర్‌ సంయుక్తంగా ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన వందలాది మంది కార్యక్రమంలో పాల్గొని ఉచిత వైద్య సేవలను పొందారు. రాఫా ప్రకృతి చికిత్సాలయం డాక్టర్‌ కిరణ్‌ కుమార్‌, రాజేంద్రనగర్‌ డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు బొక్కా ప్రభాకర్‌ రెడ్డి, నేతలు కోరని బాల్‌రాజ్‌, రగడంపల్లి శ్రవణ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఔషధ, సుగంధ ద్రవ్య మొక్కల నర్సరీ



పాల్గొన్న రైతులు, అధికారులతో వీసీ

- తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడులు
- రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం
- ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ దండా రాజిరెడ్డి

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్‌ ఉద్యాన విశ్వవిద్యాలయంలో త్వరలో రైతులకు అసరమయ్యే వివిధ ఔషధ, సుగంధ ద్రవ్య మొక్కల నిర్సరీలను ఏర్పాటు చేస్తామని, రైతులకు ఎప్పటికప్పుడు వీటిపై శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామని వీసీ దండా రాజిరెడ్డి తెలిపారు. శనివారం ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఔషధ, సుగంధ్ర మొక్కల పరిశోధన కేంద్రం, మిషన్‌ ఇంటిగ్రేటెడ్‌ డెవలప్మెంట్‌ ఆఫ్‌ హార్టికల్చర్‌ ఆధ్వర్యంలో ఔషధ మొక్కల సాగు, మార్కెటింగ్‌ అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ... ఔషధ మొక్కల పెంపకం ఇతర పంటలతో చూస్తే ఎంతో సులువైనదని వీటికి తక్కువ యాజమన్య పద్ధతులు ఉంటాయన్నారు. ముఖ్యంగా సుగంధ మొక్కలలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ విస్తీర్ణంలో అధిక దిగుబడులతో మంచి ఆదాయాన్ని పొందవచ్చని వీసీ స్పష్టం చేశారు. ప్రధానంగా ఔషధ మొక్కలను పూర్వకాలం నుంచే విరివిగా నిత్య జీవితంలో ఉపయోగిస్తున్నార్నారు. ఈ పంటలను సాగు చేయడంతో పాటు మార్కెటింగ్‌ ఉంటేనే రైతులు లాభాలు పొందుతారని అన్నారు. రైతులు స్వతహాగా చిన్న పరిశ్రమలను స్థాపించుకోవచ్చని అదే విధంగా పరిశ్రమలతో వాణిజ్య ఒప్పందాలను చేసుకొని వారికి అసరమైన ముడిసరుకును అందించవచ్చని రైతులకు సూచించారు. రైతులు అధిక దిగుబడుల కోసం అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. రిజిస్ట్రార్‌ భగవాన్‌, డీన్‌ ఆఫ్‌ రీసర్చ్‌ డాక్టర్‌ లక్ష్మీనారాయణ, డాక్టర్‌ సురేష్‌కుమార్‌, చీనానాయక్‌, డాక్టర్‌ అనితాకుమారి, ప్రశాంత్‌, వి.కృష్ణవేణి, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

ప్రణవ భక్త సమాజం సేవలు భేష్‌

సహస్రావధాని, పద్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ



మాడుగులను సన్మానిస్తున్న ప్రణవ భక్త సమాజం సభ్యులు

అత్తాపూర్‌: వందేళ్లుగా నిరాటంకంగా ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హైదర్‌గూడ ప్రణవ భక్త సమాజం అందరికీ మార్గదర్శకంగా నిలిచిందని పద్మశ్రీ అవార్డు గ్రహీత, సహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. శనివారం ప్రణవ భక్త సమాజం ఏక శతపంచోత్తర మహోత్సవాలలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... ప్రణవం అంటే ఓంకారమని, ఓంకారంలోనే సృష్టి అంతా ఇమిడి ఉందన్నారు. వందేళ్ల కిందటే ప్రణవంతో మహా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన నాటి పెద్దలు ఎంతో అభినందనీయమని వారి ఆలోచన విధానం అనిర్వచనీయమైదని అభినందించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక చైతన్య కార్యక్రమాలను చేపడుతున్న సమాజాన్ని ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సమాజం సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. శతాబ్ది ఉత్సవాలలో రెండవ రోజు శంకరానందగిరి స్వామి, వీరానంద బ్రహ్మచారి ప్రవచనాలు చేసి ప్రజలను ఆలోచింపజేశారు. రాజేంద్రనగర్‌ ఏసీపీ శ్రీనివాస్‌, ఇన్‌స్పెక్టర్‌ క్యాస్ట్రోరెడ్డి, అత్తాపూర్‌ ఇన్‌స్పెక్టర్‌ నాగేశ్వరరావు, సమాజం అధ్యక్షుడు మోండ్ర నర్సింహ, పుస్తకాల అశోక్‌, బర్ల మల్లారెడ్డి, కొండమీది హరినాథ్‌, ఎస్‌.బి.హరినాథ్‌, ముఖ్య సలహాదారులు నారగూడెం మల్లారెడ్డి, కొలన్‌ సుభాష్‌రెడ్డి, మ్యాడం రామేశ్వరరావు, కొమురయ్య పాల్గొన్నారు.

అరుదైన పక్షికి స్వేచ్ఛావాయువులు!



బండ్లగూడ: కాళ్లకు తాడు చుట్టుకొని ప్రమాదంలో పడిన అరుదైన గ్రే హెరాన్‌ అనే పక్షిని పక్షిప్రేమికుడు గౌరవ్‌ కాపాడారు. వివరాలివీ... బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని పీరంచెరువులో నూలు తాడు కాళ్లకు చుట్టుకొని గ్రేహెరాన్‌ అనే అరుదైన పక్షి విలవిలలాడుతున్న విషయాన్ని గుర్తించారు. అనిమల్‌ వారియర్స్‌ కన్జర్వేషన్‌ సొసైటీ పక్షి సంరక్షణ బాధ్యత చేపట్టింది. వారు దాదాపు నెల పాటు పక్షిని వెటర్నరీ డాక్టర్‌ సాయంతో చికిత్స చేశారు. పూర్తిస్థాయిలో కోలుకోవడంతో గ్రే హెరాన్‌ను పీబీఈయల్‌ సిటీ గ్రేటెడ్‌ కమ్యూనిటీ సభ్యులు ధీరజ్‌, రాజశేఖర్‌, రిదాష, సిరీ, శ్రియాలతో కలిసి శుక్రవారం పీరంచెరువులోకి వదిలిపెట్టి స్వేచ్ఛను కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నగర పరిధిలో ఉండే చెరువుల్లో అప్పుడప్పుడు కనిపించే అరుదైన అతి పెద్ద పక్షి గ్రే హెరాన్‌ అని అన్నారు.

ఆర్టీఐ కమిషనర్‌ భూపాల్‌కు సత్కారం



భూపాల్‌ను సన్మానిస్తున్న కమిటీ ప్రతినిధులు

రాజేంద్రనగర్‌: తెలంగాణ రాష్ట్ర ఆర్‌టీఐ కమిషనర్‌గా నియమితులైన రాజేంద్రనగర్‌ మాణిక్యమ్మ కాలనీకి చెందిన దేశపాల భూపాల్‌ (అడ్వొకేట్‌)ను శనివారం ఘనంగా సన్మానించారు. జై భీమ్‌ జై రామ్‌ జయంతి ఉత్సవాల కమిటీ రాజేంద్రనగర్‌ సర్కిల్‌ విభాగం ఆధ్వర్యంలో సన్మానించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం న్యాయవృత్తిలో ఉంటూ అన్ని వర్గాల పేద ప్రజలకు చాలా రకాలుగా సేవ చేశారని... రాష్ట్ర ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి రాజ్యాంగ బద్ధమైన ఆర్‌టీఐ కమిషనర్‌గా ఆయనను ఎంపిక చేశారని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎడ్లకాడి సూర్యం అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దాసరి రమేశ్‌, మంగళారం శ్రీనివాస్‌, జాతీయ ఎమ్మార్పీఎస్‌ నాయకులు వనం నరసింహ మాదిగ, జయంత్యుత్సవాల వ్యవస్థాపక అధ్యక్షుడు పోయిల జీవన్‌దాస్‌, ఎస్‌.వెంకటేశ్‌, క్యాసారం శంకర్‌ రావు మాదిగ, మాజీ అధ్యక్షుడు సోమారం రాజ్‌కుమార్‌, టి.ఆర్‌.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ

అత్తాపూర్‌: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించేందుకు సమగ్ర శిశు ఎడ్యుకేషన్‌ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ కార్యక్రమం మరింత ఉపయోగపడుతుందని రాజేంద్రనగర్‌ ఎంఈవో, కోర్స్‌ డైరెక్టర్‌ కేశవత్‌ శంకర్‌రాథోడ్‌ అన్నారు. అత్తాపూర్‌లోని ఎడిఫై స్కూల్‌లో చేపట్టిన ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం 5వ రోజు ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 60 శాతానికిపైగా విద్యార్థులు ప్రైవేట్‌ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని, గ్రామీణ, పట్టణ ప్రాంతాలోని పేద, మధ్య తరగతి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యను వ్యాపారంగా చేసి ఫీజుల రూపంలో దండుకుంటున్నారని అన్నారు. ఖాన్‌ అకాడమీతో ప్రాథమిక పాఠశాలలో డిజిటల్‌ విధానంతో బోధనకు ఏర్పాట్లు చేసుకున్నామన్నారు. మండల రిసోర్స్‌ పర్సన్స్‌ శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మహేశ్వర్‌, మహేష్‌, రోహిణి, సంతోషి, అనిల్‌లను శిక్షణ విషయాలను వివరించినందుకు శంకర్‌రాథోడ్‌ అభినందించారు.

దశల వారీగా అభివృద్ధి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్‌ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: దశల వారీగా అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని బీజేపీ రాజేంద్రనగర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ కార్పొరేటర్‌ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి గ్రామంలో శనివారం జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరటేర్‌ మాట్లాడుతూ... భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే కలుషిత నీరు సరఫరా అవుతుండటం వల్ల నీటిని టెస్టింగ్‌కి పంపించి వ్యర్థ పదార్థాలు కలవకుండా చూసి సమస్యలను పరిష్కరించాలన్నారు. నేతలు మన్మోహన్‌రెడ్డి, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, రావుల భాస్కర్‌, రాజేష్‌, బాల్‌రెడ్డి, రవీందర్‌, అనిల్‌, రవి, శంకర్‌రెడ్డి, జలమండలి డీజీఎం రేణుక, సూపర్‌వైజర్‌ లోక్‌నాథ్‌, రవినాయక్‌, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌లు దొంగిలించి పారిపోతూ...



వాహనంపై నుంచి పడి అపస్మారక స్థితికి చేరిన వ్యక్తి

మణికొండ: ప్రజల వద్ద సెల్‌ఫోన్‌లు దొంగలించి తన ద్విచక్రవాహనంపై పారిపోతుండగా మరో వాహనానికి ఢీ కొట్టి కిందపడిపోయిన దొంగను స్థానికులు పోలీసులకు అప్పగించిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని హైదర్‌షాకోట్‌ ప్రధాన రోడ్డుపై శనివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్‌ జిల్లా పరిగి మండలం మల్కాపురం గ్రామానికి చెందిన మహేష్‌ అతిగా మద్యం తాగి వేగంగా ద్విచక్ర వాహనం నడుపుతూ మరో బైక్‌ను ఢీ కొట్టి కింద పడిపోయాడు. అతను అపస్మారక స్థితికి చేరుకోవటంతో స్థానికులు అంబులెన్స్‌, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి అతని వద్ద పరిశీలించగా ఆరు సెల్‌ ఫోన్‌లు ఉండటం, వాటిని ఆన్‌ చేయగానే తమ సెల్‌ఫోన్‌లు పోయాయని వాటి యజమానులు ఫోన్‌లు చేశారు. దాంతో అతను హైదర్‌షాకోట్‌లో సెల్‌ఫోన్‌లు చోరీ చేసి పారిపోతూ కింద పడినట్టుగా అంచనాకు వచ్చి అతనికి గాయాలు కావటంతో ఆస్పత్రికి తరలించారు. అతను మద్యం మత్తులో అపస్మారక స్థితిలో రాత్రి వరకు ఉన్నాడు. అతని నుంచి సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు నార్సింగి క్రైం పోలీసులు తెలిపారు.

సత్వర సేవలకే ‘స్లాట్‌ బుకింగ్‌’

రిజిస్ట్రేషన్‌, స్టాంప్స్‌ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ జనరల్‌ ట్వింకిల్‌జాన్‌



మాట్లాడుతున్న ట్వింకిల్‌జాన్‌

మణికొండ: సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాలకు వచ్చే వారికి సత్వర, సులభ సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్లాట్‌ బుకింగ్‌ విధానాన్ని అమలు చేస్తున్నదని, వాటిని అవసరం అయిన వారంతా వినియోగించుకోవాలని రాష్ట్ర రిజిస్ట్రేషన్‌, స్టాంప్స్‌ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ జనరల్‌ ట్వింకిల్‌ జాన్‌ అన్నారు. శనివారం నార్సింగిలోని గండిపేట సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలో స్లాట్‌ బుకింగ్‌ పద్ధతిపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు కొన్ని ఎంపిక చేసిన సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో కొత్త పద్ధతిని కొనసాగిస్తున్నామన్నారు. ఆయా కార్యాలయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సునాయాసంగా ప్రజలు సేవలు పొందుతున్నారన్నారు. జూన్‌ 2వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో స్లాట్‌ బుకింగ్‌ పద్ధతిని అమలు చేస్తామన్నారు. అందుకు సబ్‌రిజిస్ట్రార్‌లు పూర్తి స్థాయిలో సంసిద్ధులై ఉండాలన్నారు. కొత్త పద్ధతి వల్ల ప్రజలు కార్యాలయాల్లో ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేదన్నారు. వారికి కేటాయించిన స్లాట్‌ సమయానికి ఐదు నిమిషాల ముందు వచ్చి మరో ఐదు నిమిషాల్లో వారి రిజిస్ట్రేషన్‌ పూర్తవుతుందన్నారు. కార్యాలయాలకు వచ్చే బిల్డర్‌లు, ప్రజలకు కొత్త పద్ధతిపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా రిజిస్ట్రార్‌ సంతోష్‌, గండిపేట, శంకర్‌పల్లి, రాజేంద్రనగర్‌, శేరిలింగంపల్లి సబ్‌రిజిస్ట్రార్‌లు ఆంజనేయులు, బాసిత్‌ఖాన్‌, రాంభూపాల్‌, అన్వేశితల, సిబ్బంది పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి

మణికొండ రెడ్డి ఫౌండేషన్‌ నాయకులు



విజయ్‌కుమార్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న రెడ్డి ఫౌండేషన్‌ నేతలు

మణికొండ: మనకు ఉన్న దాంట్లో కొంత లేని వారికి ఇచ్చి వారిని పోత్సహించే సేవా కార్యక్రమాలు చేపడితే అవి మనకు ఎంతో మానసిక తృప్తిని ఇస్తాయని మణికొండ రెడ్డి ఫౌండేషన్‌ నాయకులు ఎస్‌.రామసుబ్బారెడ్డి, బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఎ.శ్రీపతిరెడ్డి, నార్సింగి మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ వి.బాల్‌రెడ్డి పేర్కొన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో జలమండలి లైన్‌మెన్‌గా పనిచేస్తున్న విజయ్‌కుమార్‌ వెన్నునొప్పి, సయాటికా సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. చికిత్స చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బంది ఉన్న విషయాన్ని తెలుసుకుని ఫౌండేషన్‌లోని కొందరు దాతలు ఆయనకు రూ. 25 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సామి మనుషులు ఇబ్బందుల్లో ఉంటే వారిని అలాగే వదిలేయకుండా తమవంతు సాయంగా వారికి చేయూతనిస్తూ ఆదుకుంటున్నామన్నారు. విజయ్‌కుమార్‌కు వచ్చే జీతం కుటుంబ పోషణకే సరిపోని పరిస్థితిలో ఆస్పత్రి ఖర్చులు భరించటం ఇబ్బందిగా మారిందన్నారు. నిరంతరం ప్రజలకు తాగునీటిని అందించేందుకు కష్టపడే అలాంటి వారికి సాయం చేయాలనే ఉద్దేశంతో తమ వంతుగా ఆర్థిక సాయం అందించామన్నారు. రాబోయే రోజుల్లోనూ ఇలాంటి వారికి తమ వంతున ఆర్థిక సాయం చేసి ఆదుకుంటామని వారు స్పష్టం చేశారు. రెడ్డి ఫౌండేషన్‌ నాయకులు కె.శరత్‌రెడ్డి, పి.సైదిరెడ్డి, జి.శ్యాంరెడ్డి, ఎ.సుధాకర్‌రెడ్డి తదితరులు ఆర్థిక సాయం అందించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శాస్త్రిపురం: కాలనీలు, బస్తీల్లో కార్పొరేట్‌ ఆస్పత్రులు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను ఆయా ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకొని వైద్య సేవలను పొందాలని ఇంటిగ్రో ఆస్పత్రి వైద్యులు ఫయాజుల్లాఖాన్‌ అన్నారు. శనివారం శాస్త్రిపురం డివిజన్‌ హసన్‌నగర్‌లో నురానిమసీద్‌ ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు ఫయాజుల్లాఖాన్‌ మాట్లాడుతూ... ఏటా పేదలు అధికంగా నివసించే బస్తీలలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. వైద్యులు ఇమ్రాన్‌ అహ్మద్‌ ఖాన్‌, మహ్మద్‌ గౌస్‌, మసీదు కమిటీ సభ్యులు సయ్యద్‌ తౌఫిక్‌, షేక్‌ అన్సారీ, ఎంఐఎం నాయకులు మహ్మద్‌ జాంగీర్‌, సిద్ధిఖీ అహ్మద్‌, మహ్మద్‌ సర్వర్‌ తదితరులు పాల్గొన్నారు.